సాక్షి నంద్యాల

బుధవారం ၊ 25 ၊ జూన్ ၊ 2025



డీసీసీబీలో అక్రమాల పరంపర!

ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరువు బజారున పడుతోంది. ఏదో ఒక మూల అక్రమాలు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

8లో▸



వర్షం కోసం పూజలు

గడివేముల: వర్షం కోసం గని గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,615.95
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 50.342
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 23,500
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 196

న్యూస్‌రీల్

మల్లన్న ఉచిత స్పర్శ దర్శనానికి టోకెన్ విధానం



శ్రీశైలదేవస్థాన ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లన్న ఉచిత స్పర్శ దర్శనంలో పారదర్శకత కోసం కొత్తగా టోకెన్ విధానాన్ని ప్రవేశపెడుతున్నామని, ఏరోజుకారోజు కౌంటర్ల ద్వారా టోకెన్లను జారీ చేస్తామని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ప్రతి మంగళవారం నుంచి శుక్రవారం వరకు మల్లన్న ఉచిత స్పర్శదర్శనాన్ని పునఃప్రారంభిస్తున్నామని తెలిపారు. కంప్యూటరైజ్ టోకెన్లలో భక్తుని పేరు, ఆధార్, ఫోన్ నెంబరును నమోదు చేస్తామని, ఈ టోకెన్లను ఉచిత దర్శనం క్యూలైన్ ప్రవేశద్వారం వద్ద ఉన్న స్కానింగ్ ద్వారా తనిఖీ చేసి భక్తులను ఉచిత స్పర్శదర్శనానికి అనుమతిస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని బట్టి రోజుకు 1,000 నుంచి 1,200 టోకెన్లను జారీ చేస్తామని, ఉచిత టోకెన్లు కలిగిన భక్తులను మాత్రమే అనుమతిస్తామని వివరించారు. స్పర్శదర్శనానికి వచ్చే పురుషులు సంప్రదాయ దుస్తులు తెల్ల పంచె, మెడలో తెల్లకండువా, మహిళలు చీర, రవిక, చున్నీతో కూడిన సల్వార్ కమీజ్‌లను ధరించాల్సి ఉంటుందని సూచించారు.

పడిపోయిన కందులు, వాము ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కందులు, వాము ధరలు పడిపోయాయి. మంగళవారం మార్కెట్‌కు వాము 182 క్వింటాళ్లు, కందులు 457 క్వింటాళ్లు వచ్చాయి.వాము క్వింటాకు కనిష్ఠంగా రూ.1, 550,గరిష్ఠంగా రూ.21,412 లభించింది. సగటు ధర రూ.16,850 నమోదైంది. కందుల ధర రైతులను నిరాశకు గురి చేస్తోంది. కనిష్ఠ ధర రూ.4,089, గరిష్ఠ ధర రూ.6,769 మాత్రమే లభించగా.. సగటు ధర రూ.6,629 పలికింది. వ్యాపారులు సిండికేట్ కావడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు నిరాశజనకంగా లభిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గాలులతో కూడిన తేలికపాటి వర్షాలే!

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఐదు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో గాలుల తీవ్రతే కొనసాగనుంది. ఈ నెల 25న ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. బలమైన గాలులు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 26 నుంచి గాలుల తీవ్రతతో పాటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులను వర్షాలు నిరాశకు గురి చేస్తున్నాయి. కాగా సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ఏడు మండలా ల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. వెల్దుర్తిలో 4.2 మి.మీ, హొళగుందలో 3.2, మద్దికెరలో 2.8, ఓర్వకల్‌లో 1.2, గోనెగండ్లలో 1.2, ఆదోనిలో 1.2, క్రిష్ణగిరిలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

858.60 అడుగులుగా శ్రీశైలం డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 858.60 అడుగులకు చేరుకుంది. ఎగువ జూరాలలో స్పిల్‌వే ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం సోమవారం నుంచి మంగళవారం వరకు 46,495 క్యూసెక్కుల వరద నీటిని శ్రీశైలంకు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 101.6785 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సాగు బరువై.. మద్దతు కరువై



ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొక్కజొన్న ప్రధాన పంట. కర్నూలు జిల్లాలో 5,101, నంద్యాల జిల్లాలో 50,155 హెక్టార్లలో సాగవుతోంది. భూమి చదును చేసుకోవడం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సేద్యం, లేబర్ చార్జీలు.. ఇలా అన్ని రకాల ఖర్చులు కలిపి వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం హెక్టారుకు పెట్టుబడి వ్యయం రూ.66,642. హెక్టారుకు దిగుబడి 25 క్వింటాళ్లు వస్తుందని అంచనా. అంటే క్వింటా మొక్కజొన్న పండించడానికి రైతుకు అవుతున్న ఖర్చు రూ.2,665. అయితే కేంద్ర ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి క్వింటా మొక్కజొన్నకు ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,400 మాత్రమే. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో అమ్ముకుంటే పెట్టిన పెట్టుబడి కూడా దక్కదని రైతులు వాపోతున్నారు.



వ్యవసాయంలో పెరిగిపోతున్న పెట్టుబడి వ్యయం

- ఆకాశాన్నంటిన రసాయన ఎరువులు, పురుగు మందుల ధరలు
- యాంత్రికంగా మద్దతు ధరలను ప్రకటించిన కేంద్రం
- క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోని వైనం
- రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో చర్చల ఊసే కరువు

కర్నూలు(అగ్రికల్చర్): ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి వివిధ పంటలకు మద్దతు ధరలను ప్రకటించింది. వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను గుర్తించి, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో చర్చించిన తర్వాత మద్దతు ధరలను ప్రకటించాల్సి ఉంది. అయితే ఇటీవల ప్రకటించిన మద్దతు ధరలను పరిశీలిస్తే యాంత్రికంగా ప్రకటించినట్లుగా స్పష్టమవుతోంది. రసాయన ఎరువుల ధరలను కేంద్రం అడ్డగోలుగా పెంచింది. పురుగు మందల ధరలు కొండెక్కాయి. సేద్యం, కూలీ ఖర్చులు భారీగా పెరిగాయి. ఫలితంగా సాగులో పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను సవరించాల్సి ఉంది. అలాంటిది పెట్టుబడి వ్యయానికి, ఇటీవల ప్రకటించిన మద్దతు ధరలకు పొంతన లేకపోవడం గమనార్హం. మద్దతు ధరలు లేకపోతే దళారీలు చెప్పిందే ధర అయ్యే ప్రమాదం ఉంది.

పెట్టుబడి వ్యయం కొండంత.. మద్దతు ధరలు అంతంతే!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, కంది, మినుము, జొన్న సాగు చేస్తారు. ఏ పంటకు చూసిన కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ భారీగా ఉంది. మద్దతు ధరలను ప్రకటించడంలో విధిగా పంటల వారీగా కాస్ట్ ఆఫ్ కల్టివేషన్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. అయితే 2025–26 ఏడాది కాస్ట్ ఆఫ్ కల్టివేషన్, దిగుబడులను పరిగణనలోకి తీసుకోకుండా మద్దతు ధరలను ప్రకటించడం వల్ల రైతుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు కేంద్రంలో కీలకంగా ఉన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీతో కలసి ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. మద్దతు ధరల ప్రకటనలో రైతులకు అన్యాయం జరిగినప్పటికీ కనీస స్పందన లేకుండా పోయింది. గతంలో వ్యవసాయం దండగ అని మాట్లాడిన చంద్రబాబు నేడు మద్దతు ధరల్లో జరిగిన అన్యాయాన్ని ఎలా పట్టించుకుంటారనే చర్చ రైతుల్లో జరుగుతోంది.

వివిధ పంటల్లో హెక్టారుకు పెట్టుబడి వ్యయం ఇలా..

పంట	పెట్టుబడి వ్యయం (రూ॥ల్లో)	క్వింటా ఉత్పత్తికి అవుతున్న వ్యయం(రూ॥ల్లో)	మద్దతు ధర (రూ॥ల్లో)
మొక్కజొన్న	66,641	2,666	2,400
సజ్జ	38,851	2,775	2,775
వరి	1,24,096	2,160	2,389
జొన్న	77,376	3,517	3,699
పత్తి	95,107	7,336	8,110
కంది	64,486	7,271	8,000
కొర్ర	31,382	2,617	2,500
వేరుశనగ	1,06,662	5,480	7,263

కనిష్ఠంగా రూ.69.. గరిష్ఠంగా రూ.596

కేంద్రం 2025–26 సంవత్సరానికి సవరించిన మద్దతు ధరలు రైతులకు నిరాశ, ఆందోళన మిగిల్చాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వరి ప్రధాన ఆహార పంట. ఈ పంటలో పెట్టుబడి వ్యయం ఏడాదికేడాది పెరుగుతోంది. కానీ మద్దతు ధరలను కనిష్ఠంగా రూ.69, గరిష్ఠంగా రూ. 596 మాత్రమే పెంచడం పట్ల రైతుల్లో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. 2024 -25 మద్దతు ధరపై కేవలం రూ.69 మా త్రమే పెరిగింది. కనీస మద్దతు ధర రూ. 2,600 పైన ఉంటే ధాన్యం రైతుకు కొంతమేర న్యాయం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపుగా మిగిలిన పంటలదీ ఇదే పరిస్థితి.

“ మద్దతు ధరలు నిరాశాజనకం



2025–26 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు నిరాశజనకంగా ఉన్నాయి. మద్దతు ధరలను అశాస్త్రీయంగా ప్రకటించినట్లు కనిపిస్తోంది. పత్తి, వరి, మొక్కజొన్న, కంది, మినుము ఇలా అన్ని పంటల్లో పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగింది. వరికి హెక్టారుకు పెట్టుబడి వ్యయం రూ.1.30 లక్షల వరకు ఉంటోంది. మద్దతు ధరలపై కేంద్రం పునఃసమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– జి.రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం, కర్నూలు

పత్తికి కనీస మద్దతు ధర రూ.10 వేలు ఉండాలి



కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు తీవ్ర అసంతృప్తిని మిగిల్చాయి. పత్తిలో హెక్టారుకు రూ.లక్షకు పైగా పెట్టుబడి వ్యయం వస్తోంది. రసాయన ఎరువులు, పురుగు మందులు, లేబర్ చార్జీలు, పెట్రోలు, డీజిల్ ధరలు, ట్రాక్టరు, ఇంప్లిమెంట్స్ బాడుగలతో పాటు అన్ని రకాల ఖర్చులు పెరిగిపోయాయి. దిగుబడి 8–10 క్వింటాళ్ల వరకు మాత్రమే ఉంటోంది. క్వింటాకు మద్దతు ధర రూ.10 వేలు ఉంటేనే రైతులకు న్యాయం జరుగుతుంది.

– వేణుబాబు, అధ్యక్షుడు, ఏపీ విత్తన రైతు సంఘం

ధాన్యం మద్దతు ధర రూ. 2,600 ప్రకటించాలి



నాకు 14 ఎకరాల సొంత భూమి ఉంది. మరో 30 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. గతేడాది వరిసాగు చేసి నష్టపోయా. మద్దతు ధర ఆశాజనకంగా ఉంటే దళారీలు కూడా అదే ధర ఇవ్వడానికి ముందు కు వస్తారు. మేము కూడా డిమాండ్ చేస్తాం. మద్దతు ధర కనీసం రూ.2600 ఉంటే పెట్టుబడి చేతికొస్తుంది. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వర రెడ్డి, లింగాపురం, బండి ఆత్మకూరు మండలం

జీఓ నెం.5ను సవరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

కొలిమిగుండ్ల: సచివాలయ ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 5ను తక్షణమే సవరించాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు నిరసన బాట పట్టారు. మంగళవారం వివిధ గ్రామాల సచివాలయాల ఉద్యోగులు ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈఓఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్, తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు వార్డు స్థాయిలోనే బదిలీలకు అవకాశం కల్పించి, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఎందుకు సడలింపు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇతర మండలాల్లో పోస్టింగ్ ఇస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. రేషనలైజేషన్‌లో మిగులు ఉద్యోగులను ఎలా ఉపయోగిస్తారు తెలియని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సీనియార్టీ, రోస్టర్ జాబితా ప్రకారం పదోన్నతులు కల్పించిన అనంతరమే బదిలీలు చేపట్టాలని కోరారు. రికార్డు స్థాయి స్థాయి ఉద్యోగులకు గెజిటెడ్ ఉద్యోగుల స్థాయి నిబంధనలు విధించడం సరికాదన్నారు. సొంత మండలాల్లోనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సీమ ప్రాజెక్టులకు తక్షణమే నీరు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(అర్బన్): శ్రీశైల రిజర్వాయర్ నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు తక్షణమే నీటిని విడుదల చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నుంచి విడుదల చేయాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర జల వనరుల శాఖకు ఈమెయిల్ ద్వారా లేఖ పంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు చేరిన నేపథ్యంలో పోతిరెడ్డిపాడు, మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి సీమ ప్రాంతానికి నీరు విడుదల చేయాలన్నారు. ముందస్తు వర్షాలు కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్సార్బీసీ ఆయకట్టు కింద లక్ష ఎకరాలకు పైగా మొక్కజొన్న, సోయాబిన్, మినుము, తదితర ఆరుతడి పంటలను సాగు చేశారన్నారు. ప్రాజెక్టులకు తక్షణమే నీటిని విడుదల చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ పరిరక్షణ సమితి నాయకులు రామసుబ్బారెడ్డి, బాలీశ్వరరెడ్డి, వైఎన్‌రెడ్డి, అసదుల్లా, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

సోయాబీన్ విత్తనాల కోసం రైతుల ఆందోళన



రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పాములపాడు: మిట్టకందల గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద సోయాబీన్ విత్తనాల కోసం రైతులు ఆందోళనకు దిగారు. మనవూరు నేస్తాలు అనే సంస్థ ద్వారా మండలంలో సోయాబీన్ విత్తనాల పంపిణీ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతోంది. మండలానికి 112 క్వింటాళ్ల సోయాబీన్ విత్తనాలు మంజూరయ్యాయి. మంగళవారం సంస్థ సిబ్బంది వెంకటరాముడు సుమారు 50 ప్యాకెట్లు గ్రామంలోని ఆర్‌ఎస్‌కేలో నిల్వ చేశారు. కాగా మండలంలో అధికంగా సాగయ్యే వాడాల, మద్దూరు గ్రామాల్లో ప్రధానంగా పంపిణీ చేయాల్సి ఉందని వ్యవసాయ శాఖ సిబ్బంది పేర్కొన్నారు. దీంతో ఆ విత్తనాలను మరో గ్రామానికి తరలించేందుకు సిద్ధం చేస్తుండగా మిట్టకందాల రైతులు అడ్డుకున్నారు. తమ గ్రామానికి వచ్చిన విత్తనాలను పక్క గ్రామాలకు ఎలా తరలిస్తారని, స్థానిక రైతులకే పంపిణీ చేయాలని ఆందోళనకు దిగారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా మిట్టకందాల గ్రామంలో కేవలం 40 ఎకరాల్లో మాత్రమే సోయాబీన్ సాగు చేస్తారని, దీంతో ఆ గ్రామానికి ఆరు క్వింటాళ్లు కేటాయిస్తామని రైతులకు చెప్పామని తెలిపారు. సాగు చేస్తున్న ప్రాంతాలను బట్టి పంపిణీ చేస్తామని చెప్పారు. గోదాములు లేకనే ఆ గ్రామంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశామని, ప్రభుత్వం మంజూరు చేసిన మేరకు రైతులకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితాకు సహకరించండి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రామునాయక్

నంద్యాల: తప్పుల్లేని ఓటర్ల జాబితాకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ అన్నారు. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలోని మృతులు తొలగింపు, మార్పులు, చేర్పులను బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే సంబంధి త అధికారులకు తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ.. హోమ్ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గిరిజనలు, చెంచు జనాభా ఎక్కువగా ప్రాంతాల్లో వారికి ఓటింగ్‌పై చైతన్యం కల్పించాలని కోరారు. సమావేశంలో ఎన్నిక విభాగ సూపరింటెండెంట్ జయప్రసాద్, ఇన్‌చార్జ్ ఏఓ సుభాకర్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి సాయిరాంరెడ్డి, బీఎస్పీ పార్టీ ప్రతినిధి కొట్టం శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ ప్రతినిధి కె.శివరాంరెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రం.. అభివృద్ధికి దూరం

- ఏడాది పూర్తయినా ఒక్క అభివృద్ధి పని చేపట్టని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభించిన రూ.125 కోట్ల పనులు నిలుపుదల
- భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం



శ్రీశైల ఆలయం వ్యూ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు గణనీయంగా పెరుగుతుంది. శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం, భక్తుల రద్దీకి అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిపైన కావస్తున్నా ఇంతవరకు ఒక్క అభివృద్ధి పని ప్రారంభించలేదు. భక్తుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.125 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా.. కూటమి ప్రభుత్వం ఆయా పనులను తమకు నచ్చిన కాంట్రాక్టర్‌కు ఇచ్చుకోవాలని, కొన్ని డిజైన్లు సరిగా లేవని తదితర కారణాలు చూపుతూ నిలుపుదల చేశారు. కానీ ఇంతవరకు ఒక్క అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది తరువాత హడావుడిగా సుమారు 109 పనులకు టెండర్ పిలిచారు. కానీ ఆయా పనులు తమ పార్టీ వారికి అనుకూలంగా ఇచ్చుకుంటున్నారని దేవదాయ కమిషనర్‌కు ఫిర్యాదు అందడంతో ఆ టెండర్లను రద్దు చేశారు. అత్యవసర పనులకు, మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పనులకు మాత్రమే అనుమతించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఇంతవరకు ఒక్క అభివృద్ధి పని చేయలేదు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది ఉత్సవాలకు, కార్తీకమాసం, దసరా, సంక్రాంతి ఉత్సవాలకు చేసే ఏర్పాట్లు తప్పా ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఏమి చేపట్టలేదు. అడపాదడపా కొన్ని అత్యవసర పనులు తప్పా చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదనే చెప్పుకోవాలి.



దేవస్థాన పరిపాలన భవనం

రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు..

కూటమి ప్రభుత్వం ఏడాది అనంతరం గత నాలుగు రోజుల క్రితం శ్రీశైల దేవస్థానం సుమారు రూ. 12 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించింది. సుమారు రూ.8కోట్లతో మేజర్ వర్క్‌లు, రూ.4 కోట్లతో మైనర్ పనులకు ఆ టెండర్లు పిలిచారు. ఈ టెండర్లు అయినా సక్రమంగా జరుగుతాయో లేక గతంలో మాదిరి రద్దు చేస్తారో వేచి చూడాలి. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం శ్రీశైల మహాక్షేత్రం అభివృద్ధిపై దృష్టిసారించి, క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

రూ.125 కోట్ల పనులను ఆపేశారు..

శ్రీశైల మహాక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి, క్షేత్రానికి విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది.ఇందులో భాగంగానే దేవాదాయశాఖపై మాజీ సీఎం జగన్ పలుమార్లు సమీక్షలు నిర్వహించి శ్రీశైల క్షేత్రంలో సుమారు రూ.125కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.75 కోట్ల అంచనా వ్యయంతో అధునాతన సదుపాయాలతో నూతన క్యూకాంప్లెక్స్, రూ.35 కోట్లతో సువిశాలమైన సాలు మండపాలు, రూ.5.5కోట్లతో శ్రీశైలక్షేత్రానికి సంబంధించిన 4,400 ఎకరాల భూమికి ఫారెస్ట్ బౌండరీ ఏర్పాటు, రూ.కోటితో పంచమఠాలన్నింటిని భక్తులు ఒకేసారి దర్శించేలా ఏకరూట్ ఏర్పాటు, రూ.2.6 కోట్లతో శ్రీశైలంలోని మల్లమ్మకన్నీరు వద్ద 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకుల నిర్మాణం, రూ.1.6 కోట్లతో క్షేత్ర పరిధిలోని పలుచోట్ల 50 లక్షల వాటర్ ట్యాంకు నిర్మాణాలు, రూ.2 కోట్లతో ప్రకాశం జిల్లా దోర్నాల వద్ద దేవస్థాన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్, రూ.1.8 కోట్లతో ప్రకాశం జిల్లా దోర్నాల వద్ద నూతన కల్యాణమండపాన్ని నిర్మించేందుకు టెండర్లు పిలిచి 2023 డిసెంబరు 27న మాజీ దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. అనంతరం సాధారణ ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో వివిధ కారణాలతో ఆయా టెండర్లను రద్దు చేశారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులు (ఫైల్)

సజావుగా డీఎస్సీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఉదయం, మధ్యాహ్నం జరిగిన ఇంగ్లీష్ పేపర్ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం పరీక్షకు 878 మందికి గాను 724 మంది హాజరు 154 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్ష 879 మందికి గాను 760 మంది హాజరు కాగా.. 119 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

డీసీసీబీలో అక్రమాల పరంపర!

- కూటమి ప్రభుత్వంలో మసకబారిన డీసీసీబీ ప్రతిష్ట
- గతేడాది సెప్టెంబరులో ఆత్మకూరు బ్రాంచ్‌లో రూ.80.12 లక్షల స్వాహా
- చిప్పగిరి మండలంలో రూ.కోటి మింగేసిన సొసైటీ సీఈఓ
- తాజాగా నాగంపల్లి సొసైటీలో రూ.40 లక్షలు స్వాహాకార్యం
- కొండలా పేరుకుపోతున్న నిరర్థక ఆస్తులు



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరువు బజారున పడుతోంది. ఏదో ఒక మూల అక్రమాలు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు బ్యాంకు ఉద్యోగులు, మరోవైపు పీఏసీఎస్ సీఈఓలు నిధులు కొల్లగొడుతూ.. డీసీసీబీ ప్రతిష్టను గంగలో కలిపేస్తుండటం గమనార్హం. దీపం ఉన్నపుడే ఇళ్లు చక్కబెట్టుకోవాలన్నట్లుగా అవకాశం ఉన్నపుడే డబ్బులు మూట కట్టుకోవడానికి అడ్డుదారులు తొక్కుతున్నారు. ఇటీవల కొత్తపల్లి మండలం నాగంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో సీఈఓ చేతి వాటం ప్రదర్శించి నిధులు కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అక్రమాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది సెప్టెంబరు చివర్లో ఆత్మకూరు బ్రాంచ్‌లో దాదాపు రూ.కోటి కుంభకోణం వెలుగు చూసింది. నిధులు మింగేసిన వారు దర్జాగా రోడ్లపై తిరుగుతున్నారు. బ్యాంకుకు మాత్రం ఒక్క రూపాయి రికవరీ కాలేదు. ఇటీవల చిప్పగిరి మండలం రామదుర్గం పీఏసీఎస్‌లో సీఈఓనే నిధులు కొల్లగొట్టారు. ఏకంగా రూ.కోటి స్వాహా కావడం సంచలనమే. తాజాగా నాగంపల్లి పీఏసీఎస్‌లో సీఈఓనే నిధులకు ఎసరు పెట్టారు. వెలుగులోకి రాని అక్రమాలు ఎన్ని ఉన్నాయో తెలియని పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.80.12 లక్షలు స్వాహా..
రికవరీ రూ.5 లక్షలు మాత్రమే..

గతేడాది సెప్టెంబరులో ఆత్మకూరు బ్రాంచ్‌లో క్యాషియర్ అల్తాఫ్, పాసింగ్ ఆఫీసర్ రంగయ్య, మరో ఉద్యోగి శంకర్ పథకం ప్రకారం దాదాపు రూ.80.12 లక్షలు నిధులు మళ్లించారు. ఈ కుంభకోణానికి సంబంధించి ఇప్పటివరకు కేవలం రూ.5 లక్షలు మాత్రమే రికవరీ అయ్యింది. మేనేజర్ పులి రాజుతో సహా నలుగురు సస్పెన్షన్‌లో ఉన్నారు. భారీ ఎత్తున నిధులు కొల్లగొట్టిన వీరు టీడీపీ నేతల ద్వారా పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

రూ.40 లక్షలు మింగేసిన నాగంపల్లి సీఈఓ

కొత్తపల్లి మండలం నాగంపల్లి పీఏసీఎస్‌కు ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో సభ్యత్వం ఉంది. పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలకు కర్నూలు డీసీసీబీ ఈ సొసైటీకి నిధులు ఇస్తుంది. రుణాలు పంపిణీ చేసిన సీఈఓ రికవరీ చేసే సమయంలో చేతివాటం చూపినట్లు స్పష్టమవుతోంది. రైతులు రికవరీ చేసిన మేరకు రసీదులు ఇచ్చినప్పటికీ, సొసైటీకి మాత్రం జమ చేయడంలో కోతలు పెట్టారు. ఒక రైతు నుంచి రూ.లక్ష రికవరీ చేస్తే పూర్తి మొత్తానికి రసీదు ఇచ్చి సొసైటీకి మాత్రం రూ.50 వేలు మాత్రమే జమ చేసేవారు. రెండు బిల్లు బుక్కులు ఉండటం వల్ల ఒక దానిని రైతులకు, మరో దాన్ని సంఘానికి వినియోగించే వారని తెలుస్తోంది. ఈ విధంగా రైతుల నుంచి రికవరి చేసిన మొత్తంలో రూ.40 లక్షల వరకు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. సదరు సీఈఓ కోటేశ్వరరావు మూడు నెలలకుపైగా విధులకు గైర్హాజరు అవుతున్నారు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. దీంతో అనుమానం వచ్చిన డీసీసీబీ అధికారులు విచారణకు శ్రీకారం చుట్టారు. విచారణ జరిపిన కొద్ది సమయంలోనే రూ.10 లక్షలకుపైగా స్వాహా వెలుగులోకి వచ్చింది. ముక్కున వేలేసుకున్న అధికారులు స్వాహా కార్యం ఎంతుందో తేల్చడానికి లోతుగా విచారణ జరుపుతున్నారు. సొసైటీ లావాదేవీలు, రికవరీలపై డీసీసీబీ సంబంధిత బ్రాంచ్ మేనేజర్ దృష్టి ఉండాలి. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పర్యవేక్షణ ఉండాలి. సొసైటీపై ఎవ్వరు దృష్టి పెట్టకపోవడంతో యథేచ్ఛగా స్వాహా పర్వాన్ని కొనసాగించినట్లు స్పష్టమవుతోంది.

పెరిగిపోతున్న ఎన్‌పీఏ

అధికారుల అవినీతి కారణంగా జిల్లా సహకార కేంద్రబ్యాంకు నిరర్థక ఆస్తులు పెరిగిపోతున్నాయి. రికవరీపై దృష్టి పెట్టని అధికారులు స్వాహాపై ఆసక్తి చూపుతుండటం గమనార్హం. ఇందువల్ల బ్యాంకు నిరర్థక ఆస్తులు పేరుకపోతున్నాయి. 2024 ఏప్రిల్‌లో నిరర్థక ఆస్తులు రూ.195 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.265 కోట్లకు పెరిగిపోయాయి. నిరర్థక ఆస్తులు కొండలా పేరుకపోతున్నాయి.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఐదుగురికి గాయాలు
- అతిగా మద్యం సేవించి కారు నడపడంతోనే ప్రమాదం


డివైడర్‌పై ఉన్న విగ్రహం దిమ్మెను ఢీకొట్టిన కారు

కర్నూలు (టౌన్): కొత్త కారు. ఇంకా రిజిస్ట్రేషన్ కూడా చేయలేదు. అందులో ఐదుగురు వ్యక్తులు ఫుల్‌గా మద్యం సేవించి రోడ్డు మధ్యలో డివైడర్‌పై ఉన్న విగ్రహం దిమ్మెను ఢీకొట్టారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జరిగింది. కొత్త మహీంద్రా థార్ కారులో స్థానిక సోమిశెట్టి నగర్‌కు చెందిన డ్రైవర్ శశికుమార్,వితేష్, సునీల్, భార్గవ్, చంద్రకాంత్ కలిసి మద్యం సేవించారు. కొత్త బస్టాండ్ వద్ద మద్యం సేవించి మద్యం మత్తులో ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి బళ్లారి చౌరస్తా మీదుగా హోసన్న మందిరం వైపు వెళుతున్నారు. అయితే స్థానికంగా ఏపీఎస్పీ క్యాంపు ప్రధాన రహదారి గేటు ఎదురుగా మోయిన్ రోడ్డు డివైడర్‌పై ఉన్న దివంగత మేజర్ సీ.ఆర్.రెడ్డి పోలీసు అధికారి విగ్రహం దిమ్మెను ఢీకొట్టారు. విగ్రహం కూలిపోయింది. ఆ సమయంలో కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో ఐదుగురు గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు.

క్లుప్తంగా

అనాథ పిల్లల న్యాయ సహాయానికి 15100


మాట్లాడుతున్న బి.లీలా వెంకటప్రసాద్

కర్నూలు(సెంట్రల్): దిక్కులేని/అనాథ పిల్లలకు న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటప్రసాద్ ప్రజలకు సూచించారు. మంగళవారం న్యాయ సేవా సదన్‌లో సాథి కమిటీలోని సభ్యులతో స్పెషల్ డ్రైవ్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సాథి కమిటీ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలతో 125 మంది అనాథ పిల్లలను గుర్తించామని, వీరందరికీ జూన్ 26 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించి ఆధార్ కార్డులు ఇచ్చేలా చూడాలని సూచించారు. ఆధార్ కార్డులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీలు నిర్మల, లీలావతి, నంద్యాల డీఎంహెచ్ఓ శారదబాయి, ప్యానల్ లాయర్ వెంకటేశ్వర్లు, పారా లీగల్ వలంటీర్లు రాయపాటి శ్రీనివాస్, సుధారాణి, హేమంత్ పాల్గొన్నారు.

గురుకుల ఇంటర్మీడియెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పు

కర్నూలు(అర్బన్): 2025–26 విద్యా సంవత్సరానికి డాక్టర్ అంబేద్కర్ గురుకులాల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు జిల్లా కన్వీనర్ డాక్టర్ ఐ.శ్రీదేవి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నందున సీటు రావడం కచ్చితమని భావించకూడదన్నారు. ఈ నెల 26న ఉదయం 10 గంటలకు బీసీ–సి, ఎస్సీ కేటగిరీలకు చెందిన అమ్మాయిలకు, 28వ తేదీన బీసీ, ఓసీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన అమ్మాయిలకు దిన్నెదేవరపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో కౌన్సెలింగ్ ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా 27వ తేదీన బీసీ–సి, ఎస్సీ కేటగిరీలకు చెందిన అబ్బాయిలకు, 29వ తేదీన బీసీ, ఓసీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన అబ్బాయిలకు చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కేవలం ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు స్వయంగా ఆహారం, నీరు, ఇతర అవసరమైన సామగ్రి తెచ్చుకోవాలని, ఇక్కడ ఎలాంటి వసతులు కల్పించబడవన్నారు.

గ్రామాభివృద్ధిలో మహిళా సర్పంచులు కీలకం


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామాల అభివృద్ధిలో మహిళా సర్పంచులు కీలక పాత్ర పోషించాలని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ జీ.నాసరరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో మూడు రోజుల పాటు జరగనున్న మహిళా సర్పంచుల శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామ స్వరాజ్య అభియాన్ – ఆర్‌జీఎస్ఏ 2025–26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ పోషణ, అభివృద్ధి విషయంలో మహిళలు పోషిస్తున్న పాత్రనే గ్రామాభివృద్ధిలోనూ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పారిశుద్ధ్య, స్వచ్ఛమైన తాగునీరు, గ్రామ పంచాయతీ ఆస్తుల రక్షణ తదితర వాటిపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే నిధులతో గ్రామాలను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే పంచాయతీరాజ్ చట్టం గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ మంజులావాణి, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీఓటీ, డిప్యూటీ ఎంపీడీఓలు నాగేష్, శ్రీహరి, రవి, కిషోర్, సందీప్, పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకే ఫైల్స్, లింక్‌లు డౌన్‌లోడ్ చేయొద్దు

కర్నూలు (టౌన్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏపీకే ఫైల్స్, లింక్‌లను ఎవరూ ఓపెన్/డౌన్‌లోడ్ చేయరాదని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని క్లిక్ చేస్తే ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపిన లింక్‌లు,డాక్యుమెంట్లు,ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దన్నారు. ఫోన్‌లను హ్యాక్ చేసి వారి వ్యక్తిగత సమాచారం,బ్యాంకింగ్ డేటా, ఫొటోలు, డాక్యుమెంట ను దొంగలించి ఆర్థిక నష్టానికి గురి చేస్తారని వివరించారు.


జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

మోసాలు ఏలా చేస్తారంటే !

- నిందితులు వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, మేసేంజర్, ఇన్‌స్టా గ్రామ్, ఎస్ఎంఎస్ ద్వారా లింక్ పంపుతారు.
- డెలివరీ బాయ్, రీఫండ్ లింక్, డిజిటల్ కేవైసీ, రివార్డ్స్ అప్డేట్, షీ గిఫ్ట్, అరెంట్ డాక్యుమెంటు ఈ– చలానా తదితర పేర్లతో లింక్‌ల ద్వారా వినియోగదారులను ఆకర్షిస్తారు.
- ఆ లింకు ద్వారా ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడు దీన్ని యాప్ అనుకొని ఇన్‌స్టాల్ చేస్తారు.
- ఆ యాప్ అనుమతులు అడుగుతుంది. ఎస్ఎంఎస్, కాంటాక్ట్స్, కాల్ లాగ్, స్టోరేజీ, నోటిఫికేషన్స్, యాక్సెసబిలిటీ ద్వారా ఆకర్షిస్తున్నారు.
- ఈ అనుమతులతో నేరగాళ్లు ఫోన్‌ను పూర్తిగా నియంత్రిస్తారు.
- ఫోన్‌లోని ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, క్రెడిట్, డెబిట్ కార్డు సమాచారం నేరుగా నిందితులకు అందుతుంది.
- కొన్నిసార్లు యుపీఐ యాప్‌లను కూడా యాక్సెస్ చేసి ఖాతాల్లోని డబ్బును దొంగిలిస్తారు.
- కొన్ని సందర్భాల్లో ఫోన్ కెమెరా, మైక్ యాక్సెస్ చేసి వ్యక్తిగత వీడియోలు, ఆడియోలు సేకరించి బ్లాక్ మెయిల్‌కు ప్రయత్నిస్తారు.

ఎస్పీ సూచనలు

- ప్లే స్టోర్ తప్పా మరో వేదికల నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేయరాదు.
- గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింకులు, డాక్యుమెంట్లు, ఏపీకే ఫైల్‌లు ఓపెన్ చేయవద్దు
- ఫోన్‌లోని ప్రతి యాప్‌కు ఇచ్చే అనుమతులను అప్రమత్తంగా పరిశీలించండి
- బ్యాంకు అకౌంట్, యూపీఐ కార్డు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు
- ఫోన్‌లో అనుమానాస్పద యాప్ ఇన్‌స్టాల్ చేసినట్లయితే వెంటనే ఆయాప్‌ను అన్ ఇన్‌స్టాల్ చేయాలి.
- మొబైల్‌ను రీసెట్ చేసి, ట్రస్ట్ చేసిన యాప్‌లను మాత్రమే తిరిగి ఇన్‌స్టాల్ చేయాలి
- ఫోన్‌లో భద్రతా యాప్ ఉపయోగించండి
- బ్యాంకింగ్ అప్లికేషన్లలో బయోమెట్రిక్, 2–ఫ్యాక్టర్ అథెంటిఫికేషన్‌ను వాడాలి

మోసానికి గురైన వారు చేయాల్సిన చర్యలు

- తక్షణం జాతీయ సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి
- www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి
- సమీపంలోని పోలీసు స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి.

పొగాకు రైతులను ఆదుకోవాలి


ఆందోళన చేస్తున్న ఏపీ రైతు సంఘం, సీపీఎం నేతలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పొగాకు పండించిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రైవేటు కంపెనీలు, రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకు కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిపై అడ్డంగా కూర్చొని ఆందోళన చేయడంతో పోలీసులకు, రైతులకు మధ్య కొంత మేర వాగ్వాదం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, రైతులను మోసం చేస్తున్న పొగాకు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని అక్కడే బైఠాయించారు. దీంతో సీఐ కంబగిరి రాముడు విషయాన్ని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ దృష్టికి తీసుకెళ్లారు. జాయింట్ కలెక్టర్ అక్కడికి వచ్చి రైతులతో మాట్లాడుతూ.. పొగాకు కొనుగోళ్లలో జరుగుతున్న లోపాలపై చర్చించి మూడు రోజుల్లోగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రం, ప్రైవేటు కంపెనీల విషయంపై స్పష్టత ఇచ్చి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రైవేటు పొగాకు కంపెనీలు ఒప్పందం చేసుకున్న మేర క్వింటాకు రూ.18 వేలు ఇవ్వాలని రైతు నాయకులు కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మార్క్, సుధాకర్, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, పొగాకు రైతులు సుబ్బనర్సయ్య, పుల్లారెడ్డి, నారాయణ, రామ్మోహన్, వీరన్న, రామకృష్ణ, బుజ్జన్న, ప్రతాప రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. విజయీంద్రతీర్థుల రథోత్సవం


విజయీంద్రతీర్థుల రథోత్సవం నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

హొళగుంద: స్థానిక కోటవీధిలో వెలసిన విజయీంద్రతీర్థుల రథోత్సవంను బ్రాహ్మణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయీంద్రతీర్థుల 411వ మహా ఆరాధనోత్సవం ముగింపులో భాగంగా జరిగిన ఉత్తరాధన కార్యక్రమం సందర్భంగా రాఘవేంద్ర స్వామి, విజయీంద్రతీర్థుల మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం పూర్వారాధన, ఆదివారం ఏకాదశి, సోమవారం మధ్యారాధన పూజలు చేసిన బ్రాహ్మణులు మంగళవారం ఉత్తరాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌లకు నిర్మల్య విసర్జన, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, తులసి అర్చన పూజలు జరిగాయి.

రమణీయంగా సాగిన రథోత్సవం

గ్రామ పురవీధుల్లో స్వామి వారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా శ్రీపురందరదాసర భజన మండలి, భక్తి భారతి కోలాట మండలి బృందాల ఆధ్వర్యంలో నిర్వహించిన భజనలు, చిన్నారులు కోలాట నృత్యాలు, బ్రాహ్మణుల నృత్యాలు అలరించాయి. అనంతరం భజన స్వస్తి వాచన, మహా నైవేద్య, తీర్థ ప్రసాద కార్యక్రమాలతో ఆరాధనోత్సవ కార్యక్రమాలు ముగిశాయి. కార్యక్రమానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి బ్రాహ్మణులు హాజరైనట్లు విజయీంద్ర తీర్థుల సేవా ట్రస్ట్ సభ్యులు పవనాచారి, రఘునాథాచారి తదితరులు తెలిపారు.

శ్రీశైలంలో ముమ్మర తనిఖీలు


శ్రీశైల ఆలయ పరిసరాల్లో బాంబు స్క్వాడ్ తనిఖీలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో భక్తుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బృందాలచే తనిఖీలు చేపట్టారు. మంగళవారం శ్రీశైలం పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్టాండ్ పరిసర ప్రాంతాలు, సరిహద్దుల్లో, వసతి గృహాలు, గుడి పరిసర ప్రాంతాలు, చెక్‌పోస్టులలో, శ్రీశైలం అంతటా తనిఖీలు చేపట్టారు. అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవస్థానం పరిసర ప్రాంతాల్లో, ఏవైనా అనుమానాస్పద వస్తువులు ఉన్నాయేమోనని ముందస్తు జాగ్రత్తగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు ఆలయం చుట్టుపక్కల, పార్కింగ్ స్థలాలు, ప్రయాణికుల విశ్రాంతి గదులు, బస్టాండ్, కల్యాణకట్ట తదితర ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

9న దేశవ్యాప్త సమ్మె


నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కర్నూలు శాఖ కార్యదర్శి సునీయకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం శాఖ అధ్యక్షుడు మక్బూల్ అహమ్మద్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సునీయకుమార్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బీమా చట్టాల సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమాన్ని మరోమారు చేపట్టనున్నదని, దీన్ని ప్రతిఘటిస్తామన్నారు. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని ఆయన కోరారు. 3, 4 తరగతుల సిబ్బంది కోసం రిక్రూట్‌మెంట్ తక్షణం చేపట్టాలన్నారు. ఎల్ఐసీలో పాత పెన్షన్ విధానమే అమలు చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో ఏజెన్సీ యూనియన్ సెక్రటరీ గజేంద్రరెడ్డి, డెవలప్‌మెంట్ యూనియన్ నేతలు రమేష్, కర్నూలు బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌తో చదువులకు సువర్ణావకాశం


మాట్లాడుతున్న డీఆర్ఓ రామునాయక్

నంద్యాల: విద్య పట్ల ఆసక్తి ఉన్న ఉద్యోగులు, గృహిణులు ఓపెన్ స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో డీఆర్ఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. ఆసక్తి కలిగిన వారు జూలై 30 చివరి తేదీలోగా https://apopenschool.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విద్యాపీఠం జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొంది, ఉన్నత చదువులు, ఉద్యోగాలు అర్హత కలిగి ఉన్నాయన్నారు. ఓపెన్ స్కూల్ విధానంగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పోక్సో కేసు నమోదు

పాణ్యం: మండల కేంద్రానికి చెందిన బోయమద్దిలేటిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడటంతో ఈనెల 22న ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కేసు విచారణ చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

పచ్చిరొట్ట ఎరువులతో నేల సారవంతం


పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న డీఏఓ మురళీకృష్ణ, రైతులు

బండి ఆత్మకూరు: బండి ఆత్మకూరు, ఎర్రగుంట్ల గ్రామాల్లో ఏఓ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో డీఏఓ వైపీ మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయం సాంకేతిక విప్లవం ద్వారా రైతులు మరింత నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు అధికారులందరూ కృషి చేయాలన్నారు. రసాయన రహితంగా సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి పొందడమే గాకుండా నేలలో కర్బన శాతం, సూక్ష్మ పోషకాలు పెరుగుతాయన్నారు. రైతులు మిశ్రమ పంటలు సాగు చేయాలని, వరి సాగు చేసే నేలలో ముందుగా జీలుగ, పిల్లి పెసర, ఉలవలు వంటి పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలన్నారు. మండలంలో వరి, మొక్కజొన్న ఎక్కువగా పండిస్తారని, బయో డీజిల్ ఫ్యాక్టరీల్లో వరిగడ్డి, మొక్కజొన్న కాండం ఇతర భాగాలకు డిమాండ్ ఉన్నందున రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థికంగా లబ్ధి పొందాలన్నారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేశారు. వెటర్నరీ డాక్టర్ అనూష, ఏఈఓ సాయి హిమబిందు, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అశోక్ శత్రు నాయక్, ఆసియా పలువురు రైతులు పాల్గొన్నారు.

సొంతవారికి పరీక్షే!


రోగిని వైద్య పరీక్షల కోసం స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న సహాయకులు




వీల్‌చైర్‌లో వైద్య పరీక్షలకు తీసుకెళ్తూ..


సెలైన్‌తోనే వైద్య పరీక్షలకు..





కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వార్డ్‌బాయ్‌లు, స్ట్రెచర్‌బాయ్‌ల కొరత వేధిస్తోంది. ఉన్నవారు ఉన్నతాధికారుల సేవకు పరిమితం కావడంతో ఆయా వార్డుల్లో చికిత్స కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో చేరిన రోగులు, ప్రమాదాల్లో గాయపడిన వారిని వైద్య పరీక్షల నిమిత్తం సొంతవారే తీసుకెళ్లాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో కుటుంబసభ్యులు రోగులను ఆక్సిజన్ మాస్క్‌లతోనే వీల్‌చైర్‌లు, స్ట్రెచర్‌లపై ఆయా కేంద్రాలకు తీసుకెళ్లి వేచిఉండి పరీక్షలు చేయించుకుని వస్తున్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి ఆయా వార్డుల్లో వార్డ్‌బాయ్స్, స్ట్రెచర్ బాయ్స్‌లను నియమించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు